# సాంబయ్యతాత

రచన:
ఎమ్. వి. జె. భువనేశ్వరరావు

గుండెలు గుప్పెట్లో పెట్టుకొని.... మనస్సులోనుంచి పుట్టుకొస్తున్న ఆవేదనతో.... షాహుకారు ఏమంటాడో యన్న భయంతో బిక్కుబిక్కుమంటూ కూర్చొన్నాడు సాంబయ్యతాత.

'జరిగిపోయిన ఘోరంగురించి షాహుకారుకి ఎలా చెప్పటం? చెప్పినా ఊరుకొంటాడా? అయ్యో! ఎలా వుంటాడు? రూపాయి బాకీ వుందంటేనే గుడ్డలు యివ్వడు కదా! యింతపని జరిగిందంటే ఊరుకొంటాడా?' యిలా సాంబయ్యతాత మనసు పరిపరివిధముల ఆలోచిస్తుంది.

బట్టలివ్వకపోతే రోజూ వచ్చే 10 రూపాయైనా యిప్పుడెలావస్తుంది? అయ్యో, ఎలా బ్రతకాలి? ఆకలితో చనిపోవుటయే నేమో!

ఎంత అదిమిపెట్టుకొందామన్నా మనస్సులో రగుల్కొంటున్న అగ్నిజ్వాలలను ఆపలేకపోతున్నాడు. పుట్టుకొస్తున్న ఉద్దేశం, భవిష్యత్‌కోసం భయం సాంబయ్యతాతని నిశ్చలంగా ఉంచలేక పోతుంది.

మరికొన్ని క్షణాల్లో షాహుకారువస్తే తన భవిష్యత్తేమిటో తేలిపోతుంది? ఏమిచెయ్యటం? ఎలా బ్రతకడం?

మరలా అదే ఆలోచనలు, అదే ఆందోళన, అదే ఆవేదన.

* * *

ఆంధ్రప్రదేశ్‌లోని పల్లెటూర్లలో ఒక పల్లెటూరు అది. పేరు నాగులాపల్లి. ఆ వూరుచూస్తే.... అందర్కీ అదోలా అన్పిస్తుంటుంది. ఒకవిధమైన ప్రత్యేకత గోచరిస్తుంటుంది. ఎక్కడివాళ్ళక్కడే ఏదో పనిలో మునిగిపోయివుంటారు, రెండోవాళ్ళ వేపు చూడనైనా చూడరు. కుమ్మరివాడు కుండలు చేస్తుంటే, కంసాలి బంగారు ఆభరణాలు చేస్తుంటాడు. చాకలి బట్టలుతికితే, శ్రామికులు చేలలో పనిచేస్తుంటారు. ఇలాగే వీధి వీధి తిరిగి బట్ట లమ్ముతుంటాడు, సాంబయ్యతాత.

ప్రతిరోజు సాంబయ్యతాత ప్రక్కపట్నమయిన అనకాపల్లి వచ్చి, షాహుకారు రంగారావుదగ్గర నమ్మకంగా బట్టలు తీసుకెళ్ళి, నాగులాపల్లిలో అమ్ముతుండేవాడు. నాలుగు సంవత్సరములు గడపటంవలన సాంబయ్యతాతను రంగారావు అనుమానించటం జరిగేదికాదు. ఏవిధమైన హామీలేకుండానే సాంబయ్యతాతకి బట్టలిస్తుండేవాడు. సాంబయ్యతాత ఆబట్టలను కొంచెం లాభంకే అమ్మి, షాహుకారు రంగారావుకి డబ్బు జమ చేసేవాడు.

నాగులాపల్లి గ్రామానికి చెందిన కుమ్మరులు, కమ్మరులు, శ్రామికులు, కూలీలు, రైతులు అంతా సాంబయ్యతాతదగ్గరే బట్టలు కొనుక్కునేవారు. సాంబయ్యతాత దగ్గరి బట్టలంటే చాలా మన్నిక ఉంటాయి, చౌకగా యిస్తాడనే నమ్మకం ఉండుటయే వాళ్ళలా కొనుక్కోవటానికి కారణం.

సాంబయ్యతాతకూడా వాళ్ళదగ్గర ఎక్కువలాభం తీసుకోకుండానే తక్కువధరకి బట్టలు విక్రయించేవాడు.

పండుగరోజు లొచ్చాయంటే సాంబయ్యతాతకి వ్యాపారం బాగుండేది. మామూలు రోజుల్లోనయితే పెద్దగా సొమ్ము వచ్చేది కాదు. ఏటో రోజుకి 10, 12 రూపాయలు వచ్చేవి.

సాంబయ్యతాతకి కొడుకువున్నా, అతనికివున్న వీరసం వలన అప్పుడప్పుడు ఏదో కొంతడబ్బు తెచ్చేవాడు. అది అతని స్వంతఖర్చులకే సరిపోయేవికావు. సాంబయ్యతాతకి అతని భార్యని పోషించటానికే సరిపోతాయి? సాంబయ్యతాత కోడలు అక్కడా యిక్కడా ఊడిగం చేస్తే, జమీందార్లిచ్చే మిగిలిపోయిన అన్నం, కాస్తంత కూలీ యింట్లో పస్తులుండకుండా కాపాడేది. అందుకే అరవైయేళ్ళొచ్చినా సాంబయ్యతాతకి బట్టలమ్మటం తప్పించుకాదు. ఏదో ముసలితనపు బలహీనతలు ఉన్నాకూడా బట్టలమ్మందే కడుపు నిండేదికాదు, రోజులు గడిచేదికాదు. అందువలన అంత వయసొచ్చినా నాగులాపల్లి గ్రామమందు కాలినడకనే తిరిగేవాడు. ఒక్కొక్కరోజయితే అసలు అమ్మకాలే ఉండేవి కావు. ఆరోజంతా చాలా శ్రమం.

జ్వరమో, జబ్బో వస్తే డాక్టరుదగ్గరకి వెళ్ళటానికి డబ్బు వుండేదికాదు. అయినా 'బ్రతికితే బలుసాకు తినొచ్చు' అనే ఆశతో చావలేక బ్రతుకుతూ జీవితం సాగించేవాడు సాంబయ్యతాత.

* * *

ఒకరోజు సాంబయ్యతాత పండగ దగ్గర పడటంవలన కొత్త వెరైటీలు, జాకెట్‌పీసులు, చీరలు, తెద్దామనే ఉద్దే

కంతో షాహుకారు రంగారావుదగ్గరికి పయనమై వెళ్ళాడు. రంగారావు అన్నిరకాలు కాస్త ఎక్కువమొత్తంలోనే యిచ్చాడు. పాలిస్టర్ చీరలుకూడా యిచ్చాడు, అన్నిటికీ ధరలు చెప్పి, జాగ్రత్తగా అమ్మమని సాంబయ్యతాతని సాగనంపాడు.

సాంబయ్యతాత ఎప్పటిలాగే బస్‌లో పోదామని బస్ స్టాండికి బట్టలమూటని మోసుకొని వెళ్ళాడు, బస్ రాక పోవటంవలన మూట బస్‌స్టాండు బంగళాలో పెట్టి కూర్చొన్నాడు.

యింతలో ఒక వ్యక్తివచ్చి, 'తాతగారూ! బట్ట లమ్ముతారా?' అడిగాడు,

బట్టలమ్మితే బస్ ఛార్జీలకైనా వస్తుందని మనస్సులో అనుకొని 'అమ్ముతాను బాబు' అన్నాడు.

'చీరలు చూపియ్యండి. పాలిస్టర్‌వి' అన్నాడా వ్యక్తి.

అలాగేయని సాంబయ్యతాత రకరకాలివి పాలిస్టర్ చీరలు చూపించాడు. అందులో వేరు వేరు వెరైటీలని ఓ ఐదు చీరలుతీసి, ఆవ్యక్తి, 'తాతగారూ! చీరలన్నీ బాగున్నాయి! ఈ ఐదు వెరైటీలు బాగా నచ్చాయి. మాయిల్లు అదిగో ఎదురుగా కన్పిస్తున్న సందులో వుంది. మీరొస్తానంటే రండి. లేకపోతే యిక్కడే వుండండి. యిందులోవి ఐదుచీరలు మా శ్రీమతి సెలెక్ట్ చేసినతర్వాత తీసుకొని, మీకు డబ్బు అందజేస్తాను' అన్నాడు.

ఆవ్యక్తి ఎవరో తెలియకపోయినా, మాటనిబట్టి మంచివాడుగా ఊహించి, సాంబయ్యతాత, 'ఫర్వాలేదండి! వెళ్ళి మీకు నచ్చినవి తీస్కోండి. మిగిలినచీరలు, డబ్బూ తీసుకు రండి' అన్నాడు.

ఆ వ్యక్తి సాంబయ్యతాతకి మరింత నమ్మకాన్ని కలిగిస్తూ, అవునండీ తాతగారూ, మరిచిపోయాను. 'చీర రేటెంతండీ?' అడిగాడు. అమాయకుడైన సాంబయ్యతాత '100 రూపాయలు బాబూ!' అని సమాధానమిచ్చాడు. అమ్మకమయితే ఓ 10 రూపాయలు లాభమొస్తుందని ఆశించాడు.

'అయితే. యిప్పుడే వస్తాను' అని వెళ్ళిపోయాడా వ్యక్తి చీరలు పట్టుకొని.

దాదాపు గంటకాలం గడిచిపోయింది. సాంబయ్యతాత కళ్ళు ఆ వ్యక్తికోసమే ఎదురుచూస్తున్నాయ్. నాగులాపల్లి



బండి వచ్చింది. పోయింది. అయినా సాంబయ్యతాత అక్కడినుంచి కదలలేదు. ఆ వ్యక్తి చీరలు మోసగించి తీసుకెళ్ళారని తెలిసి సాంబయ్యతాత, అతనికోసమే ఆశగా ఆర్తిగా చూస్తున్నాడు. ఇక చేసేదేంలేక ఆ వ్యక్తి చెప్పిన ప్రకారం ఆ ఎదురుగావున్న సందులోకి వెళ్లాడు. సాంబయ్యతాత. యింటింక్కి వెళ్ళి వాకబు చేశాడు. ఆ వ్యక్తి చెప్పవ విషయాలన్నీ చెప్పాడు. 'యిక్కడెవరూ చీరలు పట్టుకు రాలేదండి' 'మాఅబ్బాయి యింటిదగ్గర లేనేలేదు? కాలేజీకి వెళ్ళిపోయాడు.' 'మా ఆయన బజారుకెళ్ళారు.' యిలా ప్రతిఒక్కరూ చీరలసంగతి తెలీదని సమాధానమిచ్చారు.

సాంబయ్యతాతకి లోకమంతా చీకటయిపోయింది. ఎదలోనుంచి పెనుతుఫానులు బలమైనగాలులు వీయసాగాయి. స్పృహకోల్పోయి, అక్కడే పడిపోయాడు. అక్కడి వాళ్ళంతా మొఖానికి నీళ్ళుకొట్టి లేవదీశారు. జరిగిన మోసం నుంచి తేరుకలేకపోతున్నాడు సాంబయ్యతాత.

సాంబయ్యతాతకి మనస్సంతా వికలమైపోయింది. రోజుకు 10 రూపాయైనా వస్తుందని బట్టలవ్యాపారం చేస్తే, యిప్పుడు 500 రూపాయల చీరలు ఊరకనిపోయాయి. అంతసొమ్ము యిప్పుడు షాహుకారుకి ఎలా జమచెయ్యాలి? ఎన్ని రోజులు కష్టపడిన సొమ్ము? రోజులు కష్టపడి వచ్చినలాభాన్ని జమచేస్తే 500 రూపాయల అప్పు తీరుతుంది! అడుగడుగునా ఎదురయ్యే ఆటంకాలు, కష్టాలు కఠినదినాలు ఎలా జీవించటం? ఓ పెద్ద బస్ ఓనర్‌కు ఓ బస్సు పోయినా ఓ లెక్క కాదు. కాని ఒక్క బట్టలమ్మే వాడికి కొన్నిబట్టలుపోతే ముగ్గురున్నకుటుంబానికి మూడు పూట్ల పస్తులే. అందుకే బిక్కుబిక్కుమంటున్న గుండెల్లో బట్టలమూటని ముందుపెట్టుకొని, షాహుకారు శాపనార్థాల కోసం భయంగా కాదు, తెగింపుగా ఎదురు చూస్తున్నాడు సాంబయ్యతాత.

మరి షాహుకారు దయ ఎలా వుంటుందో? లేకపోతే నాగులాపల్లి ప్రజలే తలో రూపాయేసుకొని సాంబయ్యతాతని ఆదుకోవాలి. లేకపోతే ఈ కుళ్ళిన కుటిలవ్యవస్థలో సమాధులుగా మిగిలేవి మూడు దీనశవాలు మాత్రమే.

అంకితం :

(నా మాతృమూర్తి స్వర్గీయ నూకాలతల్లి పాద పద్మాలకు.... ఈకథ అంకితం.)


# BHARATH TEXTILES

MANUFACTURERS OF :

ART SILK CARPETS, COTTON CARPETS & FAST COLOUR BEDSHEETS,

63, Palani Andavar Koil Street. P. B. No. 19.

B H A V A N I - 638 301.

మా ఫ్యాక్టరీలో తయారైన జంకాళాలు మరియు బెడ్ షీట్లు చాలా ప్రసిద్ధమైనది.

వాడిన ప్రతివారూ పదే పదే ఆర్డరిస్తున్నారు.

మా ప్రతినిధిగా వుండేవాళ్ళు మంచి లాభము పొందుతున్నారు.

ఏజెంట్లు లేని ఊళ్ళలో ఏజెంట్లు కావలెను.

(ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషులోనే)